జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 29-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 496 పేజీలు: 4 వెల : రూ.7






# సిక్కోలుపై.. మొంథా.. పంజా





**✳ జిల్లావ్యాప్తంగా వర్షం ✳ ఉప్పొంగిన వంశధార, నాగావళి, బాహుదా నదులు ✳ ముంపులో వరి, అరటి, తదితర పంటలు ✳ నేలకూలిన ఇళ్లు, చెట్లు ✳ హైవేపై రాత్రి నుంచి వాహనాల నిలుపుదల ✳ నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు ✳ తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించిన అధికారులు ✳ జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు**





**శ్రీకాకుళం, అక్టోబరు28(వార్త):** మొంథా తుఫాన్ జిల్లాను కుదిపేసింది. సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షాలకు పంటలకు నష్టం మిగిల్చింది. వంశధార, నాగావళి, బాహుదా నదులతో పాటు కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. జిల్లాలోని సుమారు 1500 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లింది. ఉద్దానంలో కొబ్బరి, అరటి పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు కూలాయి. 55 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. తుఫాన్ కారణంగా జిల్లా మీదుగా వెళ్లే సుమారు 40 రైళ్లు రద్దయ్యాయి. బుధవారం కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. తుఫాన్ తీరం దాటినప్పుడు భీకరంగా గాలులు వీచే అవకాశం ఉన్నందున జాతీయ రహదారిపై వామనాలు నిలిపివేశారు. బాహుదానదిలో వరదనీటి ప్రవాహం పెరిగింది. మంగళవారం రాత్రి 44,500 క్యూసెక్కులకు నీటి ప్రవాహం చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు జలవనరులశాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ తెలిపారు. ఎగువన ఒడిశాలో భగలట్టి రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగటంతో.. గేట్లు ఎత్తి నీరు విడిచిపెట్టారు. దీంతో బాహుదా నదికి భారీ వరద నీరు పెరిగింది. రణస్థలం, మెళియాపుట్టి, కవిటి, గార మండలాల్లో పూరిళ్లు గోడలు కూలాయి. పాతపట్నం నుంచి గోపాలపురం గ్రామానికి వెళ్లే కాజ్‌వే నీటిలో మునిగిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం సాయంత్రం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పరిశీలించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో శ్రీకాకుళం రూరల్ మండలం పీజే పేట సముద్రతీరం కోతకు గురవుతోంది. కోతకు గురైన ప్రాంతాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరూ అధైర్యపడొద్దని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. అత్యవసర పరిస్థితులకు ముందస్తు ఏర్పాట్లు చేశామని, ఏ సమస్య వచ్చినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని, తక్షణ సహాయక చర్యలు అందుతాయన్నారు.



## మొంథా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

మొంథా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ప్రజలను కోరారు. మంగళవారం స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్‌తో కలసి బందరువానిపేట, మొగదలపాడు, తదితర తీర ప్రాంత గ్రామాలను ఆయన సందర్శించారు. తీర ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు వెళ్లరాదన్నారు. శిథిలావస్థ గృహాల్లో నివాసం ఉండరాదని చెప్పారు. తీర ప్రాంత గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలకు పలు సూచనలు జారీ చేశారు. బందరువానిపేటలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడ విఆర్ఓ, పంచాయతీ కార్యదర్శులను ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలన్నారు. మొగదలపాడులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అన్ని మందులు ఉన్నది లేనిది అడిగి తెలుసుకొని ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో గార మండలం తహసీల్దార్ చక్రవర్తి, ఎంపిడిఓ, సిఐ పాపినాయుడు, ఎస్ఐ, తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన పంటపొలాలు

**మందస, అక్టోబరు 28(వార్త):** తిత్లీ తుఫాన్.. ఈ ప్రాంత ప్రజల మది నుంచి ఇంకా తొలగిపోలేదు.. తిత్లీ చేసిన గాయం ఉద్దానాన్ని ఇంకా వణికిస్తూనే ఉంది. గతం చేసిన విషాదాన్ని ఇంకా మరువక ముందే మొంథా తుఫాన్ ఈ ప్రాంత ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఇప్పటికే పలువురిని నిరాశ్రయులను చేసింది. వరి పంట పొలాలు మునిగి పోయాయి. కొన్ని చోట్ల రహదారులు పాడయ్యాయి. బెల్లుపట్టియా, చీపి ప్రాంతాల్లో బాహ్య ప్రపంచంతో ఆయా గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. చీపిగెడ్డ, మహేంద్రతనయ నదులు పొంగి ప్రవహిస్తుండడంతో రహదారులు మునిగిపోయాయి. రాకపోకలు స్థంబించిపోయాయి. తీరం దాటే సమయంలో తుపాను ఉధృతి ఎక్కువగా ఉంటుందన్న వార్తలతో ఎటువంటి నష్టం వాటిల్లుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఆస్థి, ప్రాణ నష్టం జరుగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.





# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి

**మెళియాపుట్టి, అక్టోబరు 28(వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మొంథా తుఫాన్ గా రూపాంతరం చెంది కురిసిన వర్షాలకు గ్రామాలలో పంట పొలాలలో నీటితో నిండి ఉండి తడిసినపోయిన ధాన్యాన్ని కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు లండ వెంకట్రావు తెలియజేస్తున్నారు. మండలంలో గల మురికింటిభద్ర గ్రామంలో మంగళవారం నాడు వర్షం కారణంగా నీటిలో మునిగిన పంట పొలాల్లో నున్న రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించి మరి కొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందన్న పరిస్థితులలో తుఫాన్ రూపంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియపరుస్తూనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు జరిగేలా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ అధికారులు గ్రామాలలో పంట నీట మునిగి నష్టపోయిన రైతులను గుర్తించి ఆయ రైతులకు నష్టపరిహారాన్ని అందించే చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతోపాటు రాజన మల్లేష్, బందాపు శ్రీరాములు, లండ గంగయ్య, గనియా తిరుపతిరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు దువ్వాడ బాలరాజు, రైతులు తదితరులున్నారు.

# మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయండి

**-డీఎల్వో జిల్లా అధ్యక్షుడు కుమార్**

**మెళియాపుట్టి, అక్టోబరు 28(వార్త):** మెళియాపుట్టి మండలంలో గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్న దృష్ట్యా ఇక్కడ ఐటీడీఏ ఏర్పాటుకు కృషి చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని రంపచోడవరంలో వారి స్వగృహంలో మంగళవారం కలిసి విన్నవించినట్టు డీఎల్వో జిల్లా అధ్యక్షుడు సవర కుమార్ తెలిపారు. గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సీతంపేట ఐటీడీఏ వేరే జిల్లాలో ఉండడంతో అత్యధిక గిరిజన జనాభా ఉన్న మెళియాపుట్టి కేంద్రముగా ఐటీడీఏని ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించాలని, ఐటడీఏలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, గిరిజన యువతి యువకులకు జీవనోపాధి అవకాశాలు కల్పించాలని, ట్రైకర్ ద్వారా అర్హత కలిగిన వారికి లోన్లు మంజూరు చేసి ఆదుకోవాలని, ప్రతి ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లు నియామకాలు చేపట్టాలని, దాసుపురం గ్రామానికి చెందిన ఆఫ్ షోర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, గిరిజన ప్రాంతంలో గ్రానైట్ లీజులు ఆపాలని, గిరిజనులకు కేటాయించిన నిధులు వారి గ్రామాల అభివృద్ధికే కేటాయించాలని, మెళియాపుట్టి లో గిరిజన భవనం ఏర్పాటు చేయాలని, అమాయకులైన గిరిజనులపై ఎక్సైజ్ శాఖ అధికారులు అక్రమ కేసులు బనయిస్తున్నారని వాటిని నిలుపుదల చేయాలని కోరారు. మందస మండలం కొండలోగాం రెవెన్యూ పరిధిలో గల చాపరాయి కాలనీలో సవర మాధవరావు సాగు భూమిని కొంతమంది గిరిజనేతరులు రీ సర్వే పేరుతో ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఇటువంటి చర్యలను నిరోధించాలని, గిరిజన ప్రాంతాలలో రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో వైద్యసేవలు అందక పలువురు గిరిజనులు మృత్యువాత పడుతున్నారని, గిరిజన గ్రామాల్లో తాగునీటి ఏర్పాటు చేయాలని, విద్య, వైద్యం తోపాటు మారుమూల గిరిజన గ్రామాలలో సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని, అడవులనే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని, ఏజెన్సీలో గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను శాశ్వత పరిష్కార దశగా కృషి చేయాలని విన్నవించారు. ఈ సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని సవర కుమార్ తెలిపారు.





## తుపానుతో గిరిజనులకు తీవ్ర ఇబ్బందులు

**మందస, అక్టోబరు 28(వార్త):** మొంథా తుపానుతో గిరిజనుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మందస మండలంలో బొగాబంద పంచాయతీ పరిధిలో గల కుడుమసాయి, కొంటాసాయి గిరిజన గ్రామాలలో మొంథా తుపాన్ ప్రభావం ఎక్కువగా చూపుతోంది. అతి భారీగా వర్షాలు కురుస్తుండడంతో పలు సమస్యలను గిరిజనులు ఎదుర్కొంటున్నారు. పురి గుడిసెల్లో నివసిస్తున్న కొంతమంది గిరిజనులు స్థానిక పాఠశాలలో తలదాచుకుంటున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, ఇల్లు లేనటువంటి వారిని కుడుమసాయి గ్రామానికి చెందిన స్కూల్ బిల్డింగ్ లో వారిని షెల్టర్ కల్పించారు. సచివాలయం అధికారులు, పోలీసులు పర్యవేక్షించి ఆయా కుటుంబాలకు జాగ్రత్తలు చెప్పి, భరోసా ఇచ్చారు. మొంతా తుఫాన్ సేవా కార్యక్రమంలో ఉపసర్పంచ్ సవర రాజు, అంగన్వాడీ టీచర్ సవర శాంతికుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ మంత్రి సీదిరిని సన్మానించిన దానయ్య, ఢిల్లేశ్వరరావు



**మందస, అక్టోబరు 28(వార్త):** మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, బాలిగాం పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ సొర్ర ఢిలేశ్వరరావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి పదవులకు ఎంపిక చేసింది. వెనుకబడిన తరగతుల రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ జాయింట్ సెక్రటరీగా సొర్ర దహిళలేశ్వరరావు రాష్ట్ర విభాగ కమిటీల్లో నూతనంగా నియమితులైన సందర్భంగా వారు మాజీ మంత్రి, రాష్ట్ర డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజును మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో సత్కరించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం డాక్టర్ సీదిరి అప్పలరాజును వారిని అభినందించారు. కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, ఉపాధ్యక్షుడు పులారి పీతంబరం, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మాజీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ అందాల శేషగిరిరావు, నియోజకవర్గం డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు మట్ట జయరాం, మందస మండలం ప్రధాన కార్యదర్శి బత్తిన వెంకటరావు, నియోజకవర్గం సాంస్కృతిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు, లొహరిబంద సర్పంచ్ ప్రతినిధి రాపాక శేషగిరిరావు, మందస మండలం యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, జిల్లా యువజన కార్యదర్శి సార రవికుమార్, జిల్లా ఎస్సీ విభాగం కార్యదర్శి బేలమర జీవన్, సోషల్ మీడియా కన్వీనర్ రామారావు, బహడపల్లి పంచాయతీ అధ్యక్షుడు మామిడి తులసయ్య, సర్పంచ్ ప్రతినిధి ఉమాపతి, బేతాలపురం సర్పంచ్ మామిడి సింహాద్రి, సాలిన కార్తీక్ తదితరలు పాల్గొన్నారు.



## తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు సేవలు

**మందస, అక్టోబరు 28(వార్త):** ఉద్యోగంతో పాటు సేవా కార్యక్రమాలు చేసే ప్రతీ అధికారి, ఉద్యోగిని ప్రజలు అభిమానిస్తారు.. సరిగ్గా అదే పంథాలో మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ముందుకు వెళ్తున్నారు. మొంథా తుఫానుకు అల్లాడుతున్న ప్రాంతాల్లో ఆయన పర్యటిస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో పర్యటిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. భేతాళపురం వద్ద చెట్లు పడిపోవడంతో విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, చెట్లను తొలగించి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. తీర ప్రాంతాల్లో పర్యటించి, మత్స్యకారులు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఆయన వెంట ట్రైనీ ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది కె.ఢిల్లేశ్వరరావు, రామారావు ఉన్నారు.

## బాలిగాం సమీపంలో లారీ బోల్తా

**మందస, అక్టోబరు 28(వార్త):** జాతీయ రహదారిపై పెద్ద ప్రమాదం తప్పింది. బాలిగాం సమీపంలో గల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ లారీని మరో లారీ ఓవర్ టేక్ చేయబోయే క్రమమలో ముందుగా వెళ్తున్న లారీని వెనుక మరో లారీ ప్రమాదవశాత్తు ఢీకొంది. సంఘటనలో ముందు వెళ్తున్న లారీ బోల్తా పడింది. రోడ్డునకు అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. ఈ ఘటనలో డ్రైవర్ కు గాయాల పాలయ్యాయి. నేషనల్ హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



# తుఫాన్ ప్రాంతాల్లో పర్యటించిన ప్రత్యేక అధికారి చక్రధర్‌బాబు

**పలాస, అక్టోబరు 28 (వార్త):** మెంథా తుఫాను కారణంగా జిల్లాలో ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించడానికి ప్రభుత్వం నియమించిన జిల్లా తుఫాన్ ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు లోతట్టు ప్రాంతాలను మంగళవారం పర్యటించారు. తుఫాన్ పై తీసుకొంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం మండలంలో పర్యటించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకూడదన్నారు. పర్యటనలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కిడ్నీ రీసెర్చ్, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి చేరుకోని హాస్పిటల్ నిర్వహణ గురించి సూపరిండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా విపత్తుల విభాగానికి ప్రత్యేక అధికారి అయిన చక్రధర్ బాబు ను పలాస నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకులు కలిసి తుఫాను ప్రభావిత ప్రాంతాల కోసం ఆయనకు వినతిపత్రం ఇచ్చారు.



# మేమున్నాం..!

**-పజలకు ధైర్యాన్నిస్తున్న అధికారులు**

**వీరఘట్టం, అక్టోబరు 28(వార్త):** మీకు మేమున్నాం .... ఏమి కాదులే , మేము అండగా ఉంటాం అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నూరు పోస్తున్నారు ఇక్కడ మండల స్థాయి అధికారులు. మొంథా తుఫాను కారణంగా సోమవారం నుండి అధికారులు అప్రమత్తమై ప్రజలకు మేమున్నామంటూ అభయమిస్తున్నారు అధికారులు ఉన్నతాధికారుల సూచనలతో మంగళవారం నాగావళి నదీతీర గ్రామాలలో పర్యటిస్తూ ,ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్తలు వారికి వివరిస్తూ, వారికి భరోసా కల్పిస్తున్నారు. అంతేకాకుండా తుఫాన్ తీవ్రతను గుర్తుచేస్తూ ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలి, ఎలా ఉండాలి అంటూ వారికి వివరిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు అయితే తప్పఇంటి నుండి బయటకు రావద్దంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నాగవళి నదిలో పడవలనుతిప్పకూడదని ,అలాగే ప్రజలు కూడా నది చెంతకు చేరకూడదని, ఏమైనా ప్రమాద సూచికలు కనిపిస్తే తక్షణమే వీరఘట్టంలోని కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలని వారు ప్రజలకు తెలియజేస్తున్నారు. గ్రామాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారు అక్కడ వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తారని అధికారులు తెలిపారు .ప్రజలకు ఎటువంటి ప్రాణ నష్టం గాని ,పంట నష్టం గాని, ఇతర ఏ విధమైన నష్టాలు రాకుండా ప్రభుత్వ ఆదేశాలు కనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టమని వారు వివరించారు. ఇందుకు ప్రజలు కూడా తమకు సహకరించాలని వారు చెబుతూ ,వరి పంటలను కాపాడుకునే దిశగా రైతులు ముందుకు రావాలన్నారు గ్రామాల్లో అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తమై ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చూడాలని ,ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ నది తీర ప్రాంతాన్ని పరిశీలించిన వారిలో తహాశీల్దారు ఏ .సాయి కామేశ్వరరావు, ఎంపీడీవో బి .వెంకటరమణ, ఎస్సై జి .కళాధర్ తోపాటు వీఆర్వోలు ,విఆర్ఏలు, కార్యదర్శులు ,సచివాలయాల సిబ్బంది తదితరులు ఉన్నారు.



## మత్స్యకారులకు తీవ్ర నష్టం

**ఇచ్ఛాపురం, అక్టోబరు 28(వార్త):** మొంథా తుఫాన్ ప్రభావం వలన కురిసిన భారీ వర్షలకు స్థానిక డొంకూరు గ్రామ మత్స్యకారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 30 లక్షల రూపాయిల విలువ గల ఎండకు ఆరబోసిన చేపలు తడిసి ముద్దయ్యాయి. జరిగిన నష్టానికి మత్స్యకారులు తీవ్ర ఆవేదన గుర్తైయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక కూటమి నాయకులు మంగళవారం డొంకూరు గ్రామం చేరుకొని అక్కడ మత్స్యకారులకు ప్రభుత్వానికి తెలియపరిచి సహకరిస్తామని భరోసా కల్పించారు. కాగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ మత్స్యకారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, జనసేన నాయకులు దాసరి రాజు, పి ఎ సి ఎస్ అధ్యక్షులు పెదిని బాబ్జి, మండల టీడీపీ అధ్యక్షులు లోపింటి పద్మనాభం, మండల టీడీపీ సెక్రెటరీ, నాటకరంగం డైరెక్టర్, మండల టీడీపీ సెక్రెటరీ దక్కత కామేశ్వర్ రావు, మాజీ ఎఎంసీ సాడిసహదేవ్, కూర్మారావు, ఈశ్వర్ రావు, రామారావు, గురుమూర్తి, బాలరాజు, హేమ రాజు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## తహసిల్దార్ చొరవతో పేదింటికి సహాయం

**సోంపేట/ కంచిలి, అక్టోబరు 28(వార్త):** తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు కంచిలి మండలం నువాగడ గ్రామంలో గోమాంగో సీతారాం అనే పేదవాడి ఇల్లు కూలిపోవడంతో వారి పరిస్థితిని గమనించిన కంచిలి తాసిల్దార్ రమేష్ కుమార్ తనదైన శైలిలో చొరవ చూపారు. ఆ పేద కుటుంబానికి తాత్కాలికంగా ఒక షెల్టర్ చూపించడమే కాకుండా వారి భోజనానికి ప్రస్తుతం లోటు లేకుండా ప్రభుత్వ ఏజెన్సీ నుండి 10 కిలోల బియ్యంతో పాటు కొద్ది మొత్తం నగదు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామస్తులు తహసీల్దారును అభినందించారు. ఈ వ్యవహారాన్ని వీఆర్వో కృష్ణారావు స్వయంగా నిర్వహించారు.





## అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సీడీపీఓ

**మందస, అక్టోబరు 28(వార్త):** మొంథా తుఫాను కారణంగా మందస మండలంలోని అంగన్ వాడీ కేంద్రాల పనితీరుపై సీడీపీఓ పెద్దింటి అరుణ దృష్టి సారించారు. వర్షాలకు కేంద్రాల తెరవకుండా ఉంటారన్న అనుమానంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉద్దానంలోని సముద్ర తీర ప్రాంతాలైన దున్నవూరు, గెడ్డవూరు, రట్టి, మర్రిపాడు తదితర గ్రామాల్లో గల కేంద్రాలను తనిఖీ చేశారు. తుఫాను ప్రభావితానికి దగ్గరలో ఉన్న గర్భిణీలు, బాలింతలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వారి ఇంటికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలన్నారు. విపత్తు సమయంలో అనువైన ప్రదేశాల్లో ఉండడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ సిబ్బందితో కూడా సమన్వయం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని, అంగన్ వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజరు జె. లక్ష్మి, మహిళా పోలీసు, వీఆర్వోలు, ఏఎన్ఎం, ఆయా పంచాయతీల సర్పంచ్ లు పాల్గొన్నారు.

## తుపానుకు కూలిన మట్టిల్లు



**మెళియాపుట్టి, అక్టోబరు 28(వార్త):** భరణికోట పంచాయతీ పరిధి కాటం వీధిలో సవర సురేష్ అనే గిరిజనుడికి చెందిన మట్టిల్లు కూలిపోయింది. ఆదే సమయంలో సురేష్ తన కుటుంబంతో వేరే వాళ్ళ ఇంటికి వెళ్ళిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఉదయం వరకూ అదే ఇంట్లో ఉన్న వాళ్ళు వర్షం ఈదురు గాలులు వీస్తుండటంతో సురేష్, భార్య సరోజని, ఇద్దరు పిల్లలు వేరేచోటికి వెళ్లారు. దీంతో ఇంట్లో ఉన్న బియ్యం ఇతర నిత్యావసర సరుకులు మొత్తం పాడైపోయినట్లు బాధితులు చెబుతున్నారు. అధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

## బాలి జాతర నిర్వహణకు అనుమతించండి



**జలుమూరు, అక్టోబరు 28(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ ముఖలింగేశ్వర క్షేత్రంలో, వంశధార నదీ తీరాన ఖారవేల ఘాట్లో ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే బాలి జాతర ఈ ఏడాది కార్తీక పౌర్ణమి నవంబర్ 5 (బుధవారం) నుండి నవంబర్ 9 (ఆదివారం) వరకు వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నుండి అధికారిక అనుమతులు రావాల్సిందిగా అర్చక కుటుంబ సభ్యులు తరఫున దేవస్థానం ఈవో టి.ఏడుకొండలు కి వినతిపత్రం రాజశేఖర్ సమర్పించారు. ఈవో వెంటనే స్పందించి, జాతర నిర్వహణకు సంబంధించిన అధికారిక అనుమతుల కోసం ప్రిన్సిపల్ సెక్రటరీకి మెయిల్ ద్వారా అవసరమైన వివరాలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సజావుగా కొనసాగుతున్నాయని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు శ్రీముఖలింగేశ్వరాలయ ప్రధాన అర్చకులు, దేవస్థాన అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు.

## గుబులు పుట్టిస్తోన్న మొంథా తుఫాన్

**ఎల్ఎన్ పేట/హిరమండలం, అక్టోబరు 28 (వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ అన్నదాత గుండెల్లో గుబులు పుట్టిస్తోంది... ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాను వర్షాలు కారణంగా వరిచేను వంగి పోయి చేతికొచ్చే పంట ఇంటికి చేరుతుందో లేదోనని రైతులు దిగులు చెందుతున్నారు . వాతావరణశాఖ చేసిన హెచ్చరికల వలన ఏ క్షణం ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాలలో వరిపంటలు కోతకు సిద్ధంగా ఉన్నవి. ఈ తుఫాన్ ప్రభావం ఎలా ఉంటుందోనని రైతన్నలు దిగులు చెందే పరిస్థితి నెలకొంది. వర్షం ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటం వర్షంతో పాటు గాలులు వీస్తే వరి పంటకు చాలా నష్టం వాటిల్లుతోందని దిగులు చెందుతున్నారు. హిరమండలం, ఎల్ఎన్పేట మండలాల నదీ పరివాహక గ్రామాలయిన దుర్భళాపురం,కొండరాగోలు, వాడవలస, దబ్బపాడు, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట తదితర గ్రామాల ప్రజలు తుఫాన్ వస్తే చాలు బిక్కు బిక్కు మంటూ ఉంటారు. ఈ తుఫాన్ నుంచి ఎలా గట్టుక్కుతామోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## వృద్ధురాలిని బెదిరించి.. బంగారు ఆభరణాలు చోరీ

**సారవకోట, అక్టోబర్ 28 (వార్త):** వృద్ధురాలిని బెదిరించి ఓ దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన సారవకోట మండలం బుడితి గ్రామంలోని పెద్ద వీధిలో మంగళవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. బుడితి గ్రామంలోని పెద్ద వీధికి చెందిన నిక్కు చెల్లమ్మ ఇంట్లోకి సోమవారం రాత్రి ఓ దొంగ ప్రవేశించాడు. మెడపై ఆయుధాన్ని పెట్టి ముక్కు పుడక, చెవులకు ఉన్న బంగారు ఆభరణాలను అపహరించాడు. సుమారు ఐదు గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు ఆమె పోలీసులకు సమాచారమిచ్చింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్సై అనిల్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు పట్టుకొని విచారిస్తున్నారు.

# హరి'పురం'నకు కార్తీకంలో కష్ట'కాలం'

**-రహదారిద్ర్యంతో ఇబ్బంది**

**-పట్టించుకోని పాలకులు, అధికారులు**





**మందస, అక్టోబరు 28(వార్త):** హరిపురంలో ఎంతో నేడు ఎంతో ప్రాచుర్యం పొందింది. మందస మండల కేంద్రానికి పోటీగా అభివృద్ధి చెందుతోంది.. ఇప్పటికే చెందింది కూడా.. ఉద్దాన ప్రాంతానికి కేంద్రంగా మారింది. వ్యాపారానికి కూడా ప్రసిద్ధి చెందింది. ఇటువంటి హరిపురంపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించారు. అసలు విషయం ఏమిటంటే.. కార్తీక మాసం వచ్చింది. భక్తులకు ఎంతో పవిత్రమైన రోజులు. అయ్యప్పస్వాములు, మహిళలు, భక్తులు దేవుళ్లను ఆరాధిస్తుంటారు. వేకువజామునే నిద్ర మేల్కొని చెరువులు, వాగులు, వంకల్లో స్నానాలాచరించి, నియమ, నిష్టలతో పూజలు చేస్తుంటారు. ప్రస్తుతం హరిపురంలో భక్తులు, మహిళలకు రహదారుణాలు కష్టంగా మారాయి. వేకువజామునే చెరువులు, ఆలయాలకు వెళ్లాలంటే వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. శివాలయం, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేస్తుంటారు. ఆలయాలు, చెరువులకు వెళ్లే దారులు అధ్వాన్నంగా మారాయి. ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అడుగేస్తే దుర్వాసన.. కాలి పెడితే బురద, నడవడానికి వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా స్నానాపానాదులు చేసే, చెరువు కూడా ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రి పక్క నుంచే వెళ్లేదారి కూడా బురద, చెత్తాచెదారంగా మారింది. హరిపురం పంచాయతీకి ఆదాయం ఎక్కువే. కానీ, ఆ పంచాయతీ దుస్థితి చెప్పనలవికావడంలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా పంచాయతీ, మండల అధికారులు, పాలకులు తక్షణమే స్పందించి రహదారులను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# చాప వేసుకుని కూర్చుంది..!

**-ఎటూ తేలని చాపరాయి కాలనీ భూసమస్య**

**-తహసీల్దార్ వద్ద కూడా తెగని పంచాయితీ**



**మందస, అక్టోబరు 28(వార్త):** చాపరాయికాలనీ భూముల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. తహసీల్దార్ కార్యాలయంలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఇరువర్గాలు ఆశించినప్పటికీ, మళ్లీ వాయిదానే పడింది. ఇప్పటికే ఈ సమస్య పలుమార్లు వాయిదా పడగా.. తహసీల్దార్ సమక్షంలో పరిష్కారం దొరుకుతుందని వారంతా భావించినప్పటికీ, నిరాశ ఎదురైంది. మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ చాపరాయికాలనీ వద్ద గల కొన్ని సర్వే నెంబర్ల భూములు వివాదంగా మారాయి. గిరిజనులు, గిరిజనేతరులు ఈ భూములు మావి అంటే.. కాదు మావి.. అంటుండడంతో వివాదం ప్రారంభమైంది. దీంతో ఇరువర్గాలు అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం అధికారులు, సిబ్బంది వివాద భూములు వద్దకు వెళ్లి, ఎవరి భూములో తేల్చడానికి పలు దఫాలుగా చేసిన ప్రయత్నాలు సఫలంకాలేదు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోనే సమస్య తేల్చుకోవడానికి ఇరువర్గాలు చేసిన ప్రయత్నాలు విజయవంతం కాలేదు. తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ సమక్షంలో కూడా కథ మళ్లీ మొదటి వచ్చి, వాయిదా పడడంతో ఇరువర్గాలు నిరాశ వ్యక్తం చేస్తున్నాయి. గిరిజనులు, గిరిజనేతరులు(బీసీ) ఇరువురు వర్గాలు వాదనలు తహసీల్దార్ దగ్గర వినిపించారు. ఇరువురు డాక్యుమెంట్ పరిశీలించిన్ అనంతరం ఇవి గిరిజనేతరులు కొనుగోలు చేయటం జరిగిందని వారు చెప్పగా, అవి తప్పుడు డాక్యుమెంట్స్ అని గిరిజనులు చెప్పారు. దీంతో చేసేదిలేక తహసీల్దార్ మాట్లాడుతూ సబ్ రిజిస్టర్, మందసకు లెటర్ పెడతానన్నారు. అవి ఒరిజినల్ డాక్యుమెంట్సా, తప్పుడు డాక్యుమెంట్స్.. కన్ఫర్మ్ చేస్తామన్నారు. సబ్ రిజిస్టర్ నుండి ఇన్ఫర్మేషన్ వచ్చిన నిర్ణయం వెల్లడిస్తామన్నారు. అప్పటి వరకు(గురువారం) సమస్యను వాయిదా వేయడం జరుగుతోందన్నారు. ఈ చర్చల్లో తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, గిరిజన నాయకులు, ప్రజా సంఘల నాయకులు, గిరిజనులు, కరగాన సుదర్శన్, న్యాయవాది సనపల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో అండగా ఉంటా..!

**- ప్రముఖ వ్యాపారవేత్త జీకే నాయుడు**



**సోంపేట, అక్టోబరు 28(వార్త):** సమాజంలో ఆర్థికంగా బాగా స్థిరపడిన వ్యక్తులు ఎంతోమంది ఉన్నప్పటికీ సాటి వ్యక్తులకు కష్టం వచ్చే పరిస్థితిలో ఆదుకునేందుకు ముందుకు వచ్చేది మానవత్వం గల కొద్ది మంది మాత్రమే. అటువంటి వారిలో సోంపేట మండలంలో సీనియర్ రాజకీయవేత్తగా, వ్యాపారవేత్తగా, సంఘ సేవకునిగా గుర్తింపు పొందిన జీకే నాయుడు ఒకరు. ప్రస్తుత తుఫాను నేపథ్యంలో సోంపేట మండలం తీర గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. మత్స్యకారులతో కలిసి తుపాను పట్ల అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని కోరడం పట్ల ఆయా గ్రామాల మత్స్యకారులు ఎంతగానో సంతోషించారు. ఇటువంటి నాయకుడు ఒక్కడుంటే చాలు అంటూ పలువురు కొనియాడారు. నాయుడు ఎర్రముక్కాం, బట్టిగల్లూరు, డొంకలూరు, నడుమూరు, ఎక్కువురు తదితర గ్రామాల్లో పర్యటించారు.

# లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



**పలాస, అక్టోబరు 28 (వార్త):** మొంథా తుఫాను ప్రభావం ప్రధానంగా భారీ వర్షాలు, బలమైన గాలులు, సముద్రంలో అలలు పెరగడంతో తీర ప్రాంత గ్రామాలు భయం గుప్పెట్లో బితుకు బితుకు మంటున్నాయి. వాతావరణ శాఖ సూచనల ప్రకారం తుఫాను వల్ల వచ్చే సూచనలు ఉన్నాయని, అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించడంతో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో అధికారులు సుడిగాలి పర్యటన చేస్తున్నారు. సముద్రతీర ప్రాంతాల్లో గాలుల వేగం ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, గంటకు 90 నుంచి 110 కిలోమీటర్లు వరకు గాలులు వీచే అవకాశ ముందని వాతావరణ శాఖ హెచ్చరించిందని అధికా రులు తెలియజేస్తున్నారు. తుఫాను సముద్రాన్ని అల్లకల్లోలంగా మార్చుతుందని, అలలు పెరుగుతాయని, తీరం వద్ద భారీ ఉప్పెనలు రావచ్చుని, మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలను కోరారు. ఈ నేపథ్యంలో శివసాగర్ బీచ్ లో సముద్రం 20 మీటర్లు మేరకు ముందు వచ్చింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భయం గుప్పెట్లో బితుబితుకుమంటున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అత్యవసర పనులు తప్ప బయటకి వెళ్లకుండా ఉండటం, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. నేడు, రేపు అన్ని ప్రాంతాల్లో తేలికపాటి, మోస్తరు, భారీ వర్షాలు నమోదు కావచ్చుని అదికాదు అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు అధికారులు దృష్టిలో పెట్టుకొని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధపడుతున్నారు.

## అధికారులను అప్రమత్తం చేసిన జిల్లా ప్రత్యేకాధికారి

**పోలాకి, అక్టోబరు 28 (వార్త):** తుఫాన్ నేపథ్యంలో జిల్లా ప్రత్యేక అధికారి కెవిఎన్ చక్రధరబాబు క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లను స్వయంగా పరివేక్షించినందుకు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డితో కలిసి పోలాకి మండలం దండులక్ష్మీపురం. సంతబొమ్మాలి మండలం కొల్లిపాడు. ఎం సున్నపల్లిలో పర్యటించారు సముద్ర తీర ప్రాంతాల్లో రక్షిత భవనాలు. ప్రజలను తరలించినందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పునర్వాస శిబిరాలు. అక్కడ నిల్వచేసిన ఆహార సామాగ్రి. మందులు ఇతర నిత్య అవసరాలను పరిశీలించారు. ప్రాణ ఆస్తి నష్టం లేకుండా చూడాలని సిబ్బందిని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.



# థర్మల్ పవర్‌ప్లాంట్ ఉద్యమంపై నిర్బంధం తగదు

**పలాస, అక్టోబరు 28(వార్త):** బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో తలపెట్టిన థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత కొన్ని నెలలుగా అక్కడ ఆదివాసి ప్రజలు మైదానప్రాంత ప్రజలు ప్లాంట్ మాకు వద్దని, మా వ్యవసాయక భూములను ప్లాంట్ నిర్మాణానికి ఇవ్వము అని, అనేక రూపాలలో ఉద్యమించిన ప్రభుత్వాలు బలవంతంగా డ్రోన్ల ద్వారా సర్వేలు చేయటం సరికాదని ప్రజా సంఘాలు వామపక్ష పార్టీల సంఘ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. బొడ్డపాడు గ్రామంలో ఉన్న బంధుమిత్ర అమర వీరుల స్మారక భవనంలో వామపక్ష నేతలు విలేకరులతో మాట్లాడారు. కొద్దిపాటి వ్యవసాయక భూముల పైన ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలకు పూర్తిగా భూము లేకుండా చేసే ప్రయత్నాలు ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని, ఆ క్రమంలో నిరసన చేస్తున్న ఆదివాసులను వాళ్లకు ఆ ఉద్యమానికి మద్దతు పలుకుతున్న ఉద్యమకారులను అరెస్టులు చేయటం నిరంకుశ చర్యగా అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయక భూములను కార్పోరేట్లకు కారు చౌకగా అప్పచెప్పే చర్యలను వామపక్ష ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్ మూలంగా జరుగుతున్న నష్టాలను ప్రభుత్వాలకు విన్నవించుకున్న చలనము లేకపోగా



అక్రమ అరెస్టుల ద్వారా ఉద్యమాలను ఆపడం సరికాదని, జీవించే హక్కుకు భగ్నం కలవకుండా పాలకులు ప్రయాణం చేయాలని డిమాండ్ చేశారు. సోంపేట కాకరపల్లి విద్యుత్ ప్లాంట్లకు వ్యతిరేకంగా ప్రజా సమూహంతో ప్రయాణం చేసిన నేటి పాలకులు నేడు అదే ప్లాంటు నిర్మాణానికి ఎలా ప్రయత్నం చేస్తున్నారో అర్థం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి అంటే మనిషి కేంద్రంగా జరగాలి అంతేగాని మనిషి వినాశనానికి ఉపయోగపడే పరిశ్రమలు వద్దని, ప్రజలు కేంద్రంగా అభివృద్ధి జరగాలని అటువైపు దృష్టి మళ్లించాలని, ప్రభుత్వాలకు పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల నాయకులు ఆదివాసి ఉద్యమ నాయకులను అక్రమంగా అరెస్టు చేయటం అన్యాయమని, వాళ్లపై ఏ రకమైనటువంటి కేసులు పెట్టకూడదని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్, వైకుంఠ రావు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా అధ్యక్షులు శాలిన వీరాస్వామి, గంగయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అధ్యక్షులు తామడ సన్యాసిరావు, దుష్యంతు రామారావు, కామేష్, కైలాస్, జగదీష్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పోతనపల్లి కుసుమ, బాలకృష్ణ, రాపాక మాధవరావు, పి డి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి వినోద్ కుమార్, మహిళా సంఘం నాయకులు నాగమణి, మురళి రామకృష్ణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీపీ

**మెళియాపుట్టి, అక్టోబరు 28(వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మొంథా తుఫాన్ గా రూపాంతరం చందనున్న దృశ్య అధికారులు అనుక్షణం అప్రమత్తతో వ్యవహరించి ఎక్కడ ఎటువంటి నష్టం వాటిల్లకుండా నివారణ చర్యలు చేపట్టాలని మండల అధ్యక్షురాలు రానా ఈశ్వరమ్మ అన్నారు. ఎంపీపీ ఈశ్వరమ్మ నేతృత్వంలో మంగళవారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా అధికారులు గ్రామలలో సచివాలయ ఇతర శాఖధికారులు గ్రామాలలో పర్యటించి తుఫానుపై ప్రజలకు అవగాహన కల్పించి ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి సంబంధించి వివిధ పద్ధతులపై సమీక్ష నిర్వహించారు. టెక్కలి నుండి



పెద్దలక్ష్మీపురం, అలాగే టెక్కలి నుండి నెలబొంతు వయా మెళియాపుట్టి ఆర్టీసీ సెటిల్ సర్వీస్ బస్సును పునరుద్ధరణ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని, ఈ రూట్లో సకాలంలో బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజల ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృశ్య వారికి మరల ఆర్టీసీ బస్సు సేవలు కల్పించే విషయమై సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ అధికారి దానకర్ణుడు మాట్లాడుతూ మండలంలో రైతులకు ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు రాయితీతో కూడిన తార్పాలిన్ లను అందించాలని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి ఏపీఓ రవి మాట్లాడుతూ మండలంలో గ్రామసభలు నిర్వహించి 30 కోట్ల రూపాయల అంచనాలతో ప్రజలకు అవసరమైన ఉపాధి పనులు చేయడం జరుగుతుందని తెలియపరిచారు. అలాగే వివిధ పద్దులకు సంబంధించి ఆయా శాఖ అధికారులు నివేదికలను సమావేశంలో నివేదించారు. ఈ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ తోపాటు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహన రావు, ఎంఈఓలు ఎస్ దేవేంద్రరావు, ఎం. పద్మనాభరావు, వెలుగు ఏపీఎం త్రినాధమ్మ, డిప్యూటీ తహసిల్దార్ రాము, ఏపీఓ రవి, వైద్యాధికారిని గ్రీష్మ, వైస్ ఎంపీపీ పాడి అప్పారావు, పల్లి యోగి, నంబాల వెంకటరావు, పైడిరాజు, పోలాకి జైముని రావు, ఎస్. చిట్టి, గణపతిరావు, చంద్రరావు, ఉర్లాన ఋషి, యు. రవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఇతర శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 11 కేజీల గంజాయితో ఒడిశా మహిళ అరెస్టు



**పలాస, అక్టోబరు 28 (వార్త):** 11 కేజీల గంజాయితో ఒడిశాకు చెందిన మీరా కుమారి మాలిక్ ను అరెస్ట్ అరెస్టు చేసినట్లు పలాస జి ఆర్ పి ఎఫ్ ఎస్సై ఏ కోటేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం పలాస ఆర్పిఎఫ్ సబ్ ఇన్స్పెక్టర్ మల్యాద్రి వారి యొక్క ఆర్పిఎఫ్ సిబ్బందితో కలిసి సాధారణ తనిఖీ నిమిత్తం తనిఖీ చేయుచుండగా పలాస రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం నెంబర్ 2 నార్త్ ఎండ్ వద్ద ఒక మహిళ అనుమానస్పదంగా తిరుగుతుండగా ఆమె తనిఖీ చేయగా ఆమె వద్ద ట్రాలీ బ్యాగ్ నందు 4 ప్యాకెట్లు గంజాయి బ్రౌన్ కలర్ టేప్ తో చుట్ట బడి వాటి బరువు సుమారు 11 కేజీలు విలువ సుమారు 55000/- ఉంటుందని, ఆమె వివరాలు ఒడిశా రాష్ట్రం పాజింగపేటకు చెందిన మీరా కుమారి మాలిక్ అదుపు తీసుకొని, ఆమెకి ఈ గంజాయి సాహు ఒడిశా చెందిన వ్యక్తి విజయవాడ మీదుగా ముంబై తీసుకుని వెళ్ళమని, తనకు పదివేలు ఇస్తానని, చెప్పడంతో గంజాయిని బొంబాయి తీసుకెళ్లేందుకు పలాస రైల్వే స్టేషన్ కి వచ్చానని ఆమె చెప్పింది. రైల్వే ఆర్పిఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకొని ఆమెను తగు చర్య కోసం పలాస జి ఆర్ పి సబ్ ఇన్స్పెక్టర్ ఎ కోటేశ్వరరావుకి అప్పగించగా మంగళవారం మీరా కుమార్ మాలిక్ నిందితురాలను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం విశాఖపట్నం కోర్టునకు తరలించామని జి ఆర్ పి ఎఫ్ ఎస్సై తెలిపారు.

# మొంథా తుఫాన్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

**పలాస, అక్టోబరు 28 (వార్త):** లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. పురపాలక సంఘంలోని లోతట్టు ప్రాంతాలు, శివారు గ్రామాల్లో మున్సిపల్ కమిషనర్ మంగళవారం పర్యటించారు. 6వ వార్డు పెసరుపాడుకి వెళ్లే రోడ్డులో నర్సిపురం కాలనీకి ఆనుకొని నివసిస్తున్న సంచార జాతుల, వలస కూలీల గుడారాలు ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మునిగిపోగా వారిని తమ సిబ్బంది సహాయంతో సురక్షిత ప్రాంతానికి తరలించి, వారికి భోజన సదుపాయాలు కల్పించామని కమిషనర్ తెలియజేశారు. పెసరపాడుకు వెళ్లే రహదారిలో చెరువుపై నుంచి అధిక నీరు రహదారిపై ప్రవహించి రోడ్ పూర్తిగా మూసుకుపోయిన సందర్భంగా స్థానిక ప్రజల రాకపోకలను నిలుపుదల చేసి ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. అడవి కొత్తూరు, కోసంగిపురం, పాయకరాంపురం, పారసాంబ, అంతరకుడ్డ తదితర గ్రామాలను సందర్శించి సదరు గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ వర్షపు నీటితో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండడాన్ని చూసి అక్కడ పనులు చేయించామని తెలిపారు. ముఖ్యంగా కాశీబుగ్గ, పలాస పట్టణాలలోని ముఖ్య కూడల్లు వద్ద కాలువలలో సిల్టు పేరుకుపోయి నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడం వలన జెసిబి సహాయంతో సదరు సిల్ట్



ను తీయించడం జరిగిందని తెలియజేశారు. ఏఈ అవినాష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## చెరువులను తలపిస్తున్న రోడ్లు

**నరసన్నపేట, అక్టోబరు 28 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ వీధుల రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మొంథా తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని రోడ్లపై నీరు చేరింది. గాంధీ నగర్ నాలుగు వీధులు, బొంతల వీధి, తహశీల్దార్ కార్యాలయం వద్ద, బజార్ ప్రాంతాలలో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సురక్షిత ప్రాంతాలకు చెరువు గట్టు బాధితులు



**జలుమూరు, అక్టోబరు 28(వార్త):** లింగాలవలస పంచాయతీ ఈశ్వరప్ప కోనేరు రాయి బంధ కోనేరుట్లపైనున్న పలువురుని తుఫాను ప్రభావ కారణంగా చల్లవానిపేట జడ్పీ హైస్కూల్ కు తరలించారు. ప్రభుత్వ మరియు జిల్లా కలెక్టర్ నిబంధనల మేరకు రక్షణ లేని ఇటువంటి వారికి తుఫాను సమయంలో రక్షణ కల్పించడమే ప్రభుత్వ చేయమని తాసిల్దార్ రామారావు అన్నారు. ఆయనతోపాటు ఎంపీడీవో చిన్నముడు లింగాలవాలాసా పంచాయతీ ప్రతినిధి చల్లవానిపేట సహకార సంఘం చైర్మన్ దుంగ స్వామి బాబు, ఉమామహేశ్వరరావు వీఆర్వో రాము పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించండి



**పోలాకి, అక్టోబరు 28 (వార్త):** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారిని సిహెచ్ అనిత అన్నారు. మంగళవారం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో చర్చించి గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయమని సూచించారు అక్కడ ప్రజానీకంతో చర్చించారు ఆమెతోపాటు వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకుకూరలు నాశనం.. అల్లాడుతున్న పొందరులు

**జలుమూరు, అక్టోబరు 28 (వార్త):** ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆకుకూర పంట నాశనం అయిందని జలుమూరు మండలం అల్లాడ గ్రామానికి చెందిన కొందరు రైతులు అల్లాడిపోతున్నారు. సంవత్సరమంతా ఆకుకూరలతో జీవనాపాది సాగించే మా కుటుంబాలు పూర్తిగా అన్యాయానికి గురయ్యాయని వారన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నారు పోసి ఇతర మందులు వినియోగించి నేడు పూర్తిగా వర్షపు నీటిలో మునిగిపోయి కుళ్ళిపోతున్నాయి అన్నారు. అధికారుల పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546